క్లుప్తంగా

త్యాగమూర్తి ఎల్బీజీ



ప్రసంగిస్తున్న సిద్ధయ్య

ఒంగోలు టౌన్: విద్యార్థి దశ నుంచే ప్రజల కోసం జీవించడం నేర్చుకొని మొత్తం జీవితాన్నే ప్రజలకు అంకితం చేసిన లావు బాలగంగాధర్ రావు త్యాగం, సంకల్పం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని సీఐటీయూ సీనియర్ నాయకుడు వై. సిద్దయ్య కొనియాడారు. ప్రముఖ మార్క్సిస్టు నాయకుడు లావు బాల గంగాధరరావు వర్ధంతిని గురువారం స్థానిక ఎల్బీజీ భవనంలో నిర్వహించారు. సిద్దయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అనేక విద్యార్థి ఉద్యమాల్లో.. లావు కీలకమైన పాత్ర పోషించారని చెప్పారు. 11 ఏళ్లకు పైగా అజ్ఞాతవాసం గడిపిన విప్లవకారుడు అని తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ముందుకు సాగడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మాబు చెప్పారు. కార్యక్రమానికి రఘురాం అధ్యక్షత వహించగా వి. బాలకోటయ్య, కె. రమాదేవి, కేఎఫ్ బాబు, తిరుపతయ్య, ఎస్‌డీ హుసేన్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ పరిశీలన



వాహనాల తనిఖీ పరిశీలిస్తున్న సీఐ అజయ్ కుమార్

నాగులుప్పలపాడు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నాగులుప్పలపాడు చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన పోలీసుల చెక్ పోస్టును గురువారం రూరల్ సీఐ అజయ్ కుమార్ తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎస్సై బ్రహ్మానాయుడు సిబ్బంది ఉన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో శివాలయం ప్రాంగణంలో హరిహరపుత్ర అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అంగరంగా వైభవంగా జరిగింది. ఆలయం అర్చకులు ఎంవీ రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, విగ్రహాల బిగింపు, కళాన్యాసం, నేత్రోన్మీలనం, ప్రాణ ప్రతిష్ఠ, దిష్టి కుంభం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

చెన్నకేశవస్వామి హుండీ ఆదాయం రూ.5.05 లక్షలు

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.5,05,253 వచ్చిందని ఈఓ శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. రెండు నెలల వ్యవధికి సంబంధించి హుండీ కానుకలను గురువారం లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నాగ మల్లేశ్వరరాజు, ఆలయ సిబ్బంది కోటిరెడ్డి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికే పట్టం కట్టండి



45వ డివిజన్ నాగేంద్రనగర్‌లో ప్రచారం చేస్తున్న బాలినేని శ్రీకావ్య



50వ డివిజన్ వెంకటేశ్వరకాలనీలో ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి

- ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలి
- 45, 50 డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి, శ్రీ కావ్య

ఒంగోలు సబర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధికే తిరిగి పట్టం కట్టాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి సతీమణి శచీదేవి, ఆయన కోడలు శ్రీకావ్య ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఒంగోలు నగరంలోని 50వ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీలో శచీదేవి, 45వ డివిజన్‌లోని నాగేంద్ర నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరువురూ ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రచార కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. ''మహిళలతో మమేకం- స్త్రీ శక్తితో శచీదేవి'' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి నియోజకవర్గంలో బాలినేని చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. పట్టుబట్టి మరీ నగరంలో సొంతిళ్ళులేని నిరుపేదలైన 25 వేల మందికి ఇళ్ళ పట్టాలు.. తిరిగి ప్రభుత్వం రాగానే సొంత ఇళ్ళు కట్టించే కార్యక్రమం చేపడతారని హామీ ఇచ్చారు. లబ్ధిదారులందరికీ బట్టలు పెట్టి మరీ పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని కూడా ప్రజలకు గుర్తు చేశారు. ప్రజలకు సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అందరినీ ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ప్రధానంగా విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అవ్వా, తాతలకు నెలలో ఒకటో తేదీ నాడే పింఛను అందజేసే ప్రభుత్వం మనదేనన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాదవి, 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వర రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రా రెడ్డి, కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాద రావు, డివిజన్ అధ్యక్షుడు జల్లిపల్లి సురేష్, పార్టీ నాయకులు నరాల రమణా రెడ్డి, భూమిరెడ్డి రమణమ్మ, కామేష్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఓబుల్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, సాయి, రామకృష్ణా రెడ్డి, మంజుల, రావి రమణమ్మ, గురవా రెడ్డి, తిప్పారెడ్డి, కొండారెడ్డి, సురేష్, నరసారెడ్డి, నరసింహా రెడ్డి, సోమశేఖర్, టైలర్స్ అసోసియేషన్ చైర్మన్ షేక్ సుబాని, కరుణాకర్, నాగూర్, రమ్య, ప్రవళిక, ఎంపీపీ సావిత్రి, జల్లిపల్లి సుబ్బులు, అనుమాటి ఏడుకొండలు, తూము పద్మ, చింతగుంట్ల సువర్ణ, తోపల్లి రవి, తోపల్లి అజయ్, ఓబుల్ రెడ్డి వేణు, కోటపూరి మారుతి, కండే రాములు రంగారెడ్డి, సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్డు రాయి ప్రతిష్ఠ వేడుకలు



బొడ్డురాయి ప్రతిష్ఠ వద్ద పూజలు చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం తక్కెళ్ళపాడులో గురువారం శ్రీకోదండరామస్వామి ఆలయం ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు గ్రామంలో బొడ్డురాయి ప్రతిష్ఠా వేడుకలు వైభవంగా జరిగాయి. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున ఈ వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎంపీపీ బి.విజయ, పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, సర్పంచ్ ఆలూరి సుశీల, ఆలూరి వెంకటేశ్వర్లు, నువ్వుల శ్రీనివాసరావు, పి.బ్రహ్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



దొడ్డవరంలో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న జేసీ, ఆర్‌ఓ రోనంకి గోపాల కృష్ణ

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం, మద్దిపాడు, పెదకొత్తపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను, ప్రకాశం జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును జాయింట్ కలెక్టర్, సంతనూతలపాడు రిటర్నింగ్ ఆఫీసర్ రోనంకి గోపాల కృష్ణ గురువారం పరిశీలించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, అనుమానం వస్తే బస్సుల్లో కూడా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి వాహనాన్ని పరిశీలించాలని చెక్ పోస్టులో ఉన్న సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసి ఉండడం వలన తనిఖీలు పారదర్శకంగా జరుగుతాయని అధికారులు తెలిపారు. అనంతరం దొడ్డవరం, మద్దిపాడు, పెదకొత్తపల్లిలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. తహసీల్దార్ అనూరాధ, ఆర్ఐ, అనూష, ఎలక్షన్ సెల్ క్లర్క్ మరియదాసు, పలువురు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పొత్తు, మిత్ర ధర్మం పాటించాలి



మీడియాతో మాట్లాడుతున్న శివా రెడ్డి

ఒంగోలు సెంట్రల్: పొత్తు, మిత్ర ధర్మం పాటించి ముందుకు సాగాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి కోరారు. స్థానిక భాగ్యనగర్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఒక్క సీటు దక్కక పోయినా కార్యకర్తలకు పొత్తు ధర్మం పాటించాల్సిన విధానంపై హిత బోధ చేశారు. రాష్ట్ర నాయకులు కళ్యాణ్ చక్రవర్తి జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, పార్లమెంటు కన్వీనర్ సెగ్గం శ్రీనివాసరావు, అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య, జిల్లా అధికార ప్రతినిధి బొద్దిలూరి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్, ఓబీసీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, రాజశేఖర్, సీతారామయ్య, లక్ష్మణ్, కుంచాల వెంకట శివా, శివకుమారి, తిరుమల, ప్రియా రాధిక, సుల్తానాబీ, మీడియా కోఆర్డినేటర్ ధనిశెట్టి రాము పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞానంపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎస్పీ సుంకర సాయిబాబా



సదస్సుకు హాజరైన ప్రజలు

నాగులుప్పలపాడు: న్యాయ విజ్ఞానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రామ కృష్ణారావు అన్నారు. గురువారం బి.నిడమానూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. చట్టాలు ప్రతి మనిషికీ అండగా ఉంటాయన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలి తెలియక చాలా మంది ఇబ్బంది పడుతుంటారని ఇటువంటి పరిస్థితుల్లో సమాజం ఇబ్బంది పడకుండా ఉండటానికి ఇలాంటి న్యాయ విజ్ఞాన సదస్సులు ఉపయోగపడతాయన్నారు. న్యాయ దేవత మీ ప్రాంతానికి వచ్చినట్లుగా ఉందన్నారు. పసి పిల్లలపై లైంగిక దాడులు, గృహ హింస చట్టం ఉద్దేశం గురించి తెలియజేయడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నటరాజ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్, ప్రజల బాధ్యత గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరపడానికి ఎన్నికల కమిషన్ కృషి చేస్తుందని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గురించి ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. సభాధ్యక్షత వహించిన న్యాయ కళాశాల అధ్యపకులు సుంకర సాయిబాబా మాట్లాడుతూ న్యాయం ఎలా పొందాలి, చట్టం ఏమి చెపుతుంది అనేది ఈ సదస్సు తెలియజేస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఆళ్ళ హరిబాబు, అధ్యాపకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్విస్ కళాశాల, చెన్నై లూకాస్ టీవీఎస్ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న కళాశాల, కంపెనీ ప్రతినిధులు

ఒంగోలు సెంట్రల్: క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, చెన్నై లూకాస్ టీవీఎస్ మధ్య అవగాహన ఒప్పదం కుదిరినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంత రావు తెలిపారు. ఒప్పందంలో లూకాస్ టీవీఎస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్ కుమార్, ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, మెకానికల్ విభాగపు అధిపతి డాక్టర్ నవనీత క్రిష్ణన్, డాక్టర్ భార్గవ్ పాల్గొన్నారు. అవగాహన ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ, నియామకాలు, అతిథి ఉపన్యాసాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని వక్తలు వివరించారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయక స్వామి

ఒంగోలు మెట్రో: పాల్గుణ మాసం గురువారం నగరంలోని గణపతి ఆలయాల్లో సంకటహర చతుర్థి వేడుకలు ఆలయ అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో వెలసిన విజయ గణపతి దేవాలయం, కర్నూల్ రోడ్ లోని సిద్ది బుద్ధి సమేత వినాయకుడి ఆలయం, సమతా నగర్ మణికంఠ నగర్లో కార్య సిద్ధి గణపతి దేవాలయం, బాపూజీ కాంప్లెక్స్ లో వినాయక మందిరం, కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర గణపతి మందిరం, అద్దంకి బస్టాండ్ దగ్గర ఉన్న మహాగణపతి దేవస్థానం, రాజా పానగల రోడ్ లోని లక్ష్మీ గణపతి దేవాలయం, నెల్లూరు బస్టాండ్ దగ్గర వరసిద్ది వినాయక స్వామి దేవస్థానంలో దివ్యదర్శన భాగ్యం కల్పించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అవగాహన

కొత్తపట్నం: సార్వత్రి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల యంత్రాంగం అప్రమత్తం అయింది. మండలానికి ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వలెన్స్ టీం, చెక్కపోస్టు టీంలు కేటాయించారు. ఇప్పటికే ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వలెన్స్ టీంలు తిరుగుతున్నారు. పోలీస్ శాఖ నుంచి పోలీసు కవాతు నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. పోలీస్ శాఖ నుంచి ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు పల్లెల్లో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. తమ ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవడానికి పోలీస్ శాఖ మీకు అండగా ఉంటుందని తెలుపుతున్నారు. మండలంలో 53 బూత్‌లు ఉండగా 41,902 ఓట్లు ఉన్నాయి. ఓటు హక్కు వినియోగించుకోవాడానికి పంచాయతీ రాజ్ రాఖ అధికారులు పోలీంగ్ బూత్ కేంద్రాలకు మరమ్మతులు చేపడుతున్నారు. ర్యాంప్‌లు, విద్యుత్, కిటికీలు మరమ్మతులు చేపట్టే ప్రక్రియలో ఉన్నారు. రెవెన్యూ అధికారులు కొత్త ఓట్లు చేర్చడం, మరణించిన వారి ఓట్లు తొలగించడం కార్యక్రమాలు చేస్తున్నారు. శాంతి బద్రతల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించడం, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వటం, కొంత మందిని బైండోవర్ చేయించే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఓటర్ల గురంచి అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడ ఎటువంటి ఓటర్లకు ప్రలోభాలు పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజల మధ్య చిచ్చు పెట్టే సీఏఏ

ఒంగోలు టౌన్: దేశ ప్రజల మధ్య చిచ్చు పెట్టే రాజ్యాంగ వ్యతిరేక సీఏఏ అమలు కాకుండా ప్రజలంతా సమష్టిగా అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. సీఏఏ అమలును నిరసిస్తూ ఈ నెల 30న ఒంగోలు నగరంలో జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాన్ని గురువారం నగరంలోని మల్లయ్య లింగం భవనంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు అజీజ్ పాషా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, గుజ్జుల ఈశ్వరయ్య హాజరుకానున్నారని తెలిపారు. పాత మార్కెట్ సెంటర్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే శాంతియుత నిరసన ప్రదర్శనను అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దేశంలోని ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ఈ చట్టాన్ని అమలు చేయాలని ప్రయత్నించడం దేశ సమైక్యతకే ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో హిందూ, ముస్లింల మధ్య దూరాన్ని పెంచడం ద్వారా లబ్ది పొందాలన్న కుతంత్రంతో మోదీ సర్కార్ సీఏఏ చట్టాన్ని తెచ్చిందన్నారు. దీని వలన దేశంలోని ముస్లిం ప్రజలే కాకుండా హిందూ, క్రిస్టియన్ ప్రజలు కూడా తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సి వస్తుందని, సరైన పత్రాలు లేనివారంతా విదేశీయులుగా ముద్రపడి శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవలసి వస్తుందన్నారు. నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్, రమేష్, ఎస్‌డీ సర్దార్, షేక్ సైదా పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

కంభం: సామాజిక మాధ్యమాల్లో నిరాధార, అసత్య సమాచారాలు ప్రసారాలు చేసిన వారిపై ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక సీఐ జె.రామకోటయ్య హెచ్చరించారు. సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను, ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తామని చెప్పారు. వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఇతర గ్రూపుల్లో తప్పుడు సమాచారం చేస్తే గ్రూపు అడ్మిన్‌దే పూర్తి బాధ్యతని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, కుల, మత, వర్గ, రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా తప్పుడు సమాచారం, ప్రజలను తప్పుదారి పట్టించే సమాచారం ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లో షేర్ చేయకూడదని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసభ్యకర, అభ్యంతరకర పోస్టులకు సంబంధించిన సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు లేదా ప్రకాశం జిల్లా పోలీస్ వాట్సప్ 9121102266 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ భరోసా ఇచ్చారు.

మద్యం పట్టివేత

దొనకొండ: స్థానిక ఎన్‌టీఆర్ సెంటర్ వద్ద చందలూరు గ్రామానికి చెందిన మేకనబోయిన కొండయ్య తీసుకెళ్తున్న 10 మద్యం సీసాలను పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండయ్యపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

బేస్తవారిపేట: పట్టణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై నరసింహారావు గురువారం తెలిపారు. గృహంలో మద్యం నిల్వ ఉంచుకుని అమ్ముతున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 49 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అసాంఘిక శక్తుల వివరాలు అందజేయాలని ఎస్సై కోరారు.

ఎప్పుడూ అందుబాటులో ఉంటాం

- యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి



యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న భాగ్యనగర్ వాసులు, పక్కన కార్పొరేటర్ ఈదర సురేష్

ఒంగోలు సబర్బన్: నగర ప్రజలకు తమ కుటుంబ సభ్యులంతా అందుబాటులో ఉంటామని వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 19వ డివిజన్‌లోని భాగ్యనగర్‌లో గురువారం సాయంత్రం పర్యటించారు. ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ అన్ని డివిజన్లలో అభివృద్ధి బాగా జరిగిందని, 19 డివిజన్‌లో మరీ ఎక్కువగా జరిగిందన్నారు. ఈ డివిజన్‌లో వచ్చే ఎన్నికల్లో బాలినేని శ్రీనివాస రెడ్డికి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ప్రజలందరికీ సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను అధికంగా చేస్తామన్నారు. డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్ బాబు, డివిజన్ అధ్యక్షుడు ఆర్.రాజేష్, రవికుమార్, నరేష్, పవన్, సురేష్, రవి, కోటి, చలపతితో పాటు పలువురు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

మార్కాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం పెద్దయాచవరం, మొద్దులపలిల్లో ప్రజలకు ఎన్నికల నియమావళి, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నచ్చిన పార్టీకి ఓటు వేసుకోవాలని, అలా కాకుండా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర్‌నాయక్ ఉన్నారు.

35 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

త్రిపురాంతకం: బీజేపీ నాయకుడు నీటం లాజర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ, టీడీపీ చెందిన 35 కుటుంబాల వారు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరంతా త్రిపురాంతకం అంబేడ్కర్ కాలనీకి చెందిన వారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం లభిస్తుందని తాటిపర్తి పేర్కొన్నారు. జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సచివాలయ కన్వీనర్ యల్లారెడ్డి పాల్గొన్నారు.